# శాంతి దిశగా చిగురించిన ఆశలు..

## ప్రపంచ యుద్ధాల మధ్య ప్రపంచం

### రెండో భాగం (1900-1950)

ఇరవయ్యో శతాబ్దం మొదటి సగభాగం యుద్ధాలు, భయంకర అణుబాంబు దాడులతో గడిచింది. ఐక్యరాజ్య సమితి ఆవిర్భావంతో ప్రపంచ శాంతి దిశగా చిగురించిన ఆశలతో ఈ శతాబ్దం ముగిసింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అనేక దేశాల్లో వలస పాలన అంతమైంది. 1950 నాటికి భారత్, చైనా, ఇండోనేషియా, వియత్నాం, ఈజిప్టు, నైజీరియా తదితర దేశాలు స్వాతంత్ర్యం సంపాదించాయి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలు వాటి శక్తిని కోల్పోయాయి. అమెరికా, రష్యా అగ్ర రాజ్యాలుగా ఆవిర్భవించాయి.

**ముఖ్యాంశాలు:**

- రష్యాలో 1917లో సోషలిస్టు విప్లవం వచ్చింది.
- జార్‌ల పాలనలో రష్యా రెండు ఖండాల్లో విస్తరించి 'యూరో-ఆసియా శక్తి'గా ఎదిగింది. విశాల సామ్రాజ్యంతో జనాభా దృష్ట్యా ప్రపంచంలో మూడో అతిపెద్ద దేశంగా ఉండేది.
- మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు రష్యాకు ప్రపంచంలోకెల్లా అతి పెద్ద సైన్యం ఉండేది. కానీ యుద్ధం తర్వాత దాని శక్తి తగ్గిపోయింది.
- యుద్ధం వల్ల రష్యా ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నమైంది. ఆహార పదార్థాల కొరత ఏర్పడింది.
- 1917 మార్చి 8న సెయింట్ పీటర్స్ బర్గ్ నగరంలో మహిళలు నిరసన చేపట్టి రొట్టె, శాంతి కావాలని కోరారు.
- రెండో జార్ నికోలస్ దేశం వదిలిపెట్టి పారిపోయాడు.
- 1917 ద్వితీయార్థంలో మరో విప్లవం జరిగింది. దీనికి బోల్షివిక్‌ల నాయకుడైన లెనిన్ నాయకత్వం వహించాడు.
- 1924లో లెనిన్ మరణించిన తర్వాత స్టాలిన్ కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడయ్యాడు.
- స్టాలిన్ కాలంలో 1928 నుంచి పంచవర్ష ప్రణాళికలు ప్రవేశపెట్టారు.
- గ్రామీణ ప్రాంతాల్లో ఉమ్మడి వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేశారు. రైతులందరూ అందులో పనిచేసి ఉత్పత్తిని పంచుకునేవారు.
- పరిశ్రమలన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉండేవి. స్వేచ్ఛా మార్కెట్‌కు అనుమతి లేదు.

### బహుళైచ్ఛిక ప్రశ్నలు

(1/2 మార్కు)

1. రొట్టె, శాంతి కావాలని మహిళలు ఏ నగరంలో నిరసన చేపట్టారు?
   ఎ) మాస్కో బి) బెర్లిన్
   సి) సెయింట్ పీటర్స్ బర్గ్
   డి) లండన్
2. బోల్షివిక్‌ల నాయకుడు ఎవరు?
   ఎ) స్టాలిన్ బి) కెరెన్‌స్కీ
   సి) రెండో నికోలస్ డి) లెనిన్

**సమాధానాలు**

1) సి; 2) డి.

- కార్మికులు, రైతులు, మహిళల సంక్షేమానికి, వారి కోసం విద్యా వ్యాప్తికి చర్యలు చేపట్టారు.
- రష్యా ప్రభుత్వం దేశ పౌరులందరికీ ఉపాధి కల్పించి వారి జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచగలిగింది.
- ప్రపంచమంతా తీవ్ర ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొన్నప్పటికీ రష్యా దాని ప్రభావానికి గురవలేదు.
- ఇదే సమయంలో రష్యాలో పౌర హక్కులకు విఘాతం ఏర్పడింది. పౌరులకు సాధారణ ప్రజాస్వామిక స్వేచ్ఛ కూడా లభించని పరిస్థితి తలెత్తింది. అన్ని రకాల వ్యతిరేకతను అణచివేసి ప్రతిపక్ష నాయకులను పెద్ద సంఖ్యలో హత్య చేయించారు.
- జార్జ్ ఆర్వెల్ అనే రచయిత 'యానిమల్ ఫాం' అనే నవలలో విప్లవ కాలంలో రష్యా ఆదర్శాలను ఏవిధంగా నీరుగార్చిందో తెలిపాడు.
- ప్రపంచవ్యాప్తంగా 1929లో మొదలైన తీవ్ర ఆర్థిక మాంద్యం దాదాపు రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యే వరకు (1939) కొనసాగింది. ఇది ప్రపంచంలోని అన్ని దేశాలను కుదిపేసింది.
- ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కోవడానికి నాటి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ కొత్త ఒప్పందాన్ని ప్రకటించాడు.
- ఆర్థిక మాంద్యం వల్ల అన్నింటి కంటే ఎక్కువగా జర్మనీ ప్రభావితమైంది.
- జర్మనీ వీధుల్లో పురుషులు 'ఏ పని చేయడానికైనా సిద్ధం' అనే బోర్డు (కార్డు) మెడలో తగిలించుకుని తిరిగారు.
- ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో హిట్లర్ నాజీ పార్టీని స్థాపించి ప్రజలను ఆకట్టుకున్నాడు. 1937 నాటికి జర్మనీ పార్లమెంట్ 'రీచ్‌స్టాగ్'లో ఇది అతిపెద్ద పార్టీగా అవతరించింది.
- హిట్లర్.. కమ్యూనిజం, పెట్టుబడిదారీ విధానం రెండింటినీ వ్యతిరేకించాడు.
- ఇతడు ప్రజాస్వామ్యాన్ని కూడా వ్యతిరేకించి నియంత పాలన ఏర్పరిచాడు.
- 1933 మార్చి 3న ఆమోదం పొందిన 'ఎనేబ్లింగ్ యాక్ట్'తో జర్మనీలో నియంతృత్వం ఏర్పడింది.
- నియంతృత్వ అధికారాలను ఉపయోగించుకొని లక్షలాది రాజకీయ ఉద్యమకారులను, కార్మిక సంఘాల నాయకులను, అల్ప సంఖ్యాక వర్గ ప్రజలను అరెస్టు చేశారు. వీరిలో కొంత మందిని హింసించి హత్య చేశారు.
- ఆర్థిక రంగంలో 'పూర్తి ఉత్పత్తి' అనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. దీని ద్వారా వాహనాల ఉత్పత్తి సంస్థలు, ఆయుధ కర్మాగారాలను స్థాపించారు.
- యుద్ధం జరిగితే తప్ప ఆయుధ ఫ్యాక్టరీలు నడవని పరిస్థితి తలెత్తింది. అందువల్ల హిట్లర్ తరచూ ఇతర దేశాలపై దాడి చేసే ప్రయత్నం చేశాడు.
- 1939 సెప్టెంబర్ 1న పోలండ్‌పై జర్మనీ దాడి చేయడంతో రెండో ప్రపంచ యుద్ధం మొదలైంది.
- ఈ యుద్ధంలో మొదట జర్మనీ సైన్యాలు విజయం సాధించినా 1943లో 'స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో' ఓటమితో జర్మనీ పరాజయం ప్రారంభమైంది.




- సోవియట్ సైన్యం బెర్లిన్‌ను ఆక్రమించుకోవడంతో హిట్లర్, అతడి అనుచరులు ఆత్మహత్య చేసుకున్నారు.
- జర్మనీ రెండుగా విడిపోయింది. తూర్పు జర్మనీ గణతంత్ర ప్రజాస్వామ్యం (జర్మన్ డెమొక్రటిక్ రిపబ్లిక్)గా ఏర్పడింది. ఇది యూఎస్ఎస్ఆర్ ప్రభావం కిందకి వచ్చింది. పశ్చిమ జర్మనీ గణతంత్ర సమాఖ్య (ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ)గా ఆవిర్భవించింది. ఇది యూఎస్ఏ ప్రభావం కిందకి వచ్చింది.
- హిరోషిమా, నాగసాకి నగరాలపై 1945 ఆగస్టులో అమెరికా అణుబాంబులు ప్రయోగించింది. దీంతో ఆసియాలో మరింత చెలరేగుతున్న జపాన్ లొంగిపోయింది. అమెరికా సైన్యం జపాన్‌ను ఆక్రమించుకొని రాజ్యాంగబద్ధ రాచరిక పాలన ఏర్పరచింది.

### నాలుగు మార్కుల ప్రశ్నలు

**సమాచార నైపుణ్యాలు**

1. **కింది కాల పట్టికను గమనించి ఇచ్చిన ప్రశ్నలకు జవాబు రాయండి.**

| సంఘటన | కాలం |
|---|---|
| రష్యాలో సోషలిజంపై చర్చ | 1850-1880 |
| రష్యాలో సోషల్ ప్రజాస్వామిక కార్మికుల పార్టీ ఏర్పాటు | 1898 |
| రక్తసిక్త ఆదివారం విప్లవం | 1905 |
| మార్చి 2: జార్ చక్రవర్తి పరారీ | 1917 |
| అక్టోబర్ 24: పెట్రోగ్రాడ్‌లో బోల్షివిక్‌ల తిరుగుబాటు | |
| పౌర యుద్ధం | 1913-20 |
| కామిన్ టర్న్ ఏర్పాటు | 1919 |
| భూముల ఏకీకరణ ప్రారంభం | 1929 |

**ఎ) రష్యాలో 1905లో జరిగిన విప్లవంలో రక్తసిక్తమైన రోజు ఏది?**
**బి) రష్యాలో పౌర యుద్ధం జరిగిన కాలం ఏది?**
**సి) భూముల ఏకీకరణ ప్రారంభించిన కాలం నాటి రష్యా కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు ఎవరు?**
**డి) 1917 అక్టోబర్ విప్లవానికి నాయకత్వం వహించిన వర్గం ఏది?**

జ: ఎ) రష్యాలో 1905లో జరిగిన విప్లవంలో రక్తసిక్తమైన రోజు ఆదివారం.
బి) రష్యా పౌర యుద్ధ కాలం 1918-20
సి) రష్యాలో భూముల ఏకీకరణను ప్రారంభించినవారు 'స్టాలిన్'.
డి) 1917 అక్టోబర్ విప్లవానికి నాయకత్వం వహించిన వర్గం - బోల్షివిక్.

2. **కింద ఇచ్చిన కాల పట్టికను గమనించి ప్రశ్నలకు సమాధానం రాయండి.**

| సంఘటన | తేది |
|---|---|
| వైమర్ గణతంత్ర రాజ్యాంగా ప్రకటన | 1918 నవంబర్ 9 |
| జర్మనీకి చాన్స్‌లర్‌గా హిట్లర్ | 1933 జనవరి 30 |
| పోలండ్‌పై జర్మనీ దండెత్తడం, రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం | 1939 సెప్టెంబర్ 1 |
| యు.ఎస్.ఎస్.ఆర్.పై జర్మనీ దండెత్తడం | 1941 జూన్ 22 |
| యూదులపై హత్యాకాండ | 1941 జూన్ 23 |
| అమెరికా సంయుక్త రాష్ట్రాలు రెండో ప్రపంచ యుద్ధంలో చేరడం | 1941 డిసెంబర్ 8 |
| సోవియట్ సేనలు ఔష్‌విట్జ్‌కు విముక్తి కల్పించడం | 1945 జనవరి 27 |
| యూరప్‌లో కూటమిగా సాధించిన విజయం | 1945 మే 8 |

**ఎ) ఏ సంఘటనతో రెండో ప్రపంచ యుద్ధం మొదలైంది?**
**బి) 1941 జూన్ 22న జర్మనీ ఏ దేశంపై దండెత్తింది?**
**సి) వైమర్‌ను గణతంత్ర రాజ్యంగా ప్రకటించిన రోజు ఏది?**
**డి) హిట్లర్ జర్మనీకి చాన్స్‌లర్ అయిన ఎన్నేళ్లకు ఆత్మహత్య చేసుకున్నాడు?**

జ: ఎ) 1939 సెప్టెంబర్ 1న పోలండ్‌పై జర్మనీ దండెత్తడంతో రెండో ప్రపంచ యుద్ధం మొదలైంది.
బి) 1941 జూన్ 22న జర్మనీ యు.ఎస్.ఎస్.ఆర్.పై దండెత్తింది.
సి) 1918 నవంబర్ 9న వైమర్‌ను గణతంత్ర రాజ్యంగా ప్రకటించారు.
డి) హిట్లర్ జర్మనీకి చాన్స్‌లర్ అయిన 12 ఏళ్లకు ఆత్మహత్య చేసుకున్నాడు.

**సమకాలీన అంశాలపై ప్రతిస్పందన - ప్రశ్నించడం**

3. **నాజీ జర్మనీల చేతిలో యూదులు ఏ విధమైన వేధింపులకు గురయ్యారు? ప్రతి దేశంలోనూ ఏదైనా ప్రత్యేక వర్గానికి చెందిన కొంతమంది ప్రజలు ప్రస్తుతం ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారా?**

జ: 1933 మార్చి 3న ఆమోదం పొందిన 'ఎనేబ్లింగ్ యాక్ట్'తో జర్మనీలో నియంతృత్వం ఏర్పడింది. దీనిద్వారా హిట్లర్ నియంతగా మారి నాజీపార్టీ మినహా ఇతర పార్టీలు, కార్మిక సంఘాలను నిషేధించారు. ముఖ్యంగా యూదులను తీవ్రంగా వేధించారు.
1) అల్ప సంఖ్యాకులైన యూదులను ఎలాంటి కారణం లేకుండానే అరెస్టు చేశారు.
2) నిర్బంధ శిబిరాలకు తరలించి విచక్షణా రహితంగా హింసించారు.
3) కొంత మందిని దేశం నుంచి బహిష్కరించారు.
4) రెండో ప్రపంచ యుద్ధకాలంలో పెద్ద సంఖ్యలో యూదులను నిర్దాక్షిణ్యంగా హత్య చేయించారు.
5) ఆష్విట్జ్ లాంటి హత్యా కేంద్రాల్లో యూదులను గదుల్లో నిర్బంధించి అందులోకి గ్యాస్ పంపించడం ద్వారా చంపించారు.

**సమకాలీన దృక్కోణం:**
1) ప్రస్తుతం ప్రపంచంలో ఇలాంటి సంఘటనలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయని చెప్పవచ్చు.
2) పైన పేర్కొన్న విధంగా ఘోరమైన హింసాత్మక చర్యలు లేవు.
3) కొన్ని ప్రాంతాల్లో వివక్షాపూరిత దాడులు జరుగుతున్నాయి. ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో నల్లజాతీయులపై, అమెరికాలో నీగ్రోలపై ఈ రకమైన వివక్ష ఉంది.
4) అఫ్గానిస్తాన్‌లో తాలిబన్లు శత్రుదేశాల వారిని పట్టుకొని నిర్దాక్షిణ్యంగా హింసించి చంపుతున్న సంఘటనలు జరుగుతున్నాయి.

4. **నాజీ పాలనలో తీసుకొచ్చిన రాజకీయ మార్పులు ఏమిటి? 'ఒక బలమైన నాయకుడు ఉంటే చాలు.. దేశ సమస్యలు తీరిపోతాయి' అని తరచూ కొంతమంది వాదిస్తుంటారు. జర్మనీ అనుభవాల నేపథ్యంలో ఈ వాదనపై మీరెలా స్పందిస్తారు?**

జ: **నాజీ పాలనలో తీసుకొచ్చిన రాజకీయ మార్పులు:**
1) హిట్లర్ రాజకీయాల్లో కొత్త శైలిని ప్రవేశపెట్టాడు.
2) పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించడంలో ఆచారాలు, అద్భుత దృశ్యాల ప్రాముఖ్యతను అతడు గుర్తించాడు.
3) అతడికి ఉన్న మద్దతును తెలపడానికి, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడానికి నాజీలు పెద్ద పెద్ద బహిరంగ సభలను, ప్రదర్శనలను నిర్వహించారు.
4) స్వస్తిక్ గుర్తుతో ఎర్ర జెండాల వినియోగం, నాజీ వందనం, ఉపన్యాసాల తర్వాత చప్పట్లు కొట్టడం మొదలైన మార్పులు తీసుకొచ్చారు.
5) కమ్యూనిజం, పెట్టుబడిదారీ విధానం రెండింటినీ యూదుల కుట్రగా పేర్కొంటూ హిట్లర్ ప్రజల దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు.

ఈ విధంగా జర్మనీలో నాజీల నాయకుడిగా హిట్లర్ తిరుగులేని విధంగా ఎదిగాడు.

**ప్రతిస్పందన:**
1) ఒక బలమైన నాయకుడు ఉంటే చాలు దేశ సమస్యలు తీరిపోతాయని కొంత మంది తరచూ వాదిస్తూ ఉంటారు.
2) నాజీ జర్మనీ విషయంలో ఇది ప్రారంభంలో విజయవంతమైనప్పటికీ ఆ తర్వాత హిట్లర్ అహంకారంతో అది విఫలమైంది.
3) బలమైన నాయకుడు ఉన్నంత మాత్రాన సరిపోదు. అందరినీ కలుపుకొని పోయే మనస్తత్వం ఉండాలి.
4) విదేశాంగ విధానానికి సంబంధించి సరైన అవగాహన ఉండాలి. దేశానికి ఇతర దేశాల నుంచి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలి.

# పదో తరగతి

## సాంఘిక శాస్త్రం



## ఉత్పత్తి - ఉపాధి

ఉత్పత్తి కార్యకలాపాలను ఆధారంగా చేసుకొని మన ఆర్థిక వ్యవస్థను మూడు ప్రధాన రంగాలుగా వర్గీకరించారు. అవి.. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, సేవా రంగం.

దేశ ఆర్థికాభివృద్ధిని పటిష్ఠం చేసే ఈ మూడు రంగాల మొత్తం ఉత్పత్తిని దేశ స్థూల జాతీయోత్పత్తిగా పిలుస్తారు. ఉపాధి అవకాశాలను ఉత్పత్తి ప్రభావితం చేస్తుంది. వివిధ రంగాల్లో ఉపాధి సముచితంగా ఉన్నప్పుడు ఆర్థిక వ్యవస్థ ప్రగతి ఉన్నతంగా ఉంటుంది. కార్మికుడికి సంతృప్తినిచ్చే ఉపాధి.. సామాజిక వ్యవస్థ ప్రశాంతతకు సహాయకారిగా తోడ్పడుతుంది. వీటికి విరుద్ధ పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆర్థిక అసమానతలు పెరిగి సామాజిక శాంతి దెబ్బతింటుంది. ఉత్పత్తికి తగ్గట్టుగా ఉపాధి సౌకర్యాలున్నప్పుడు దేశ సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుంది.

- ఈ పాఠ్యాంశం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి విభిన్న రంగాలు దోహదం చేసే విధానాన్ని, ఉత్పత్తి – ఉపాధిల మధ్య పరస్పర సంబంధాలను, వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాల్లో కార్మికుల స్థితిగతులను విద్యార్థులు తెలుసుకుంటారు.

### ముఖ్యాంశాలు

**ఆర్థిక వ్యవస్థలోని రంగాలు:**

1. **ప్రాథమిక రంగం (వ్యవసాయ రంగం):** వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, తోటల పెంపకం, గనుల తవ్వకం మొదలైనవి ప్రాథమిక రంగానికి చెందినవి. వీటి ఉత్పత్తి ప్రక్రియలో ప్రకృతి ప్రధాన పాత్ర పోషిస్తుంది.
2. **ద్వితీయ రంగం (పారిశ్రామిక రంగం):** చిన్న, పెద్ద తరహా పరిశ్రమలు, భవన నిర్మాణాలు, మూల వినిమయ వస్తూత్పత్తి మొదలైనవి ఈ రంగానికి చెందినవి. ఈ రంగంలో యంత్రాలు, పరికరాలు ఉపయోగించి వస్తువులు ఉత్పత్తి చేస్తారు.
3. **తృతీయ రంగం (సేవారంగం):** వస్తువులను నేరుగా ఉత్పత్తి చేయకుండా ప్రజలకవసరమైన సేవలను అందించే కార్యకలాపాలు ఈ రంగంలో ఉంటాయి.
   **ఉదా:** బ్యాంకింగ్, వాణిజ్యం, ప్రసార సాధనాలు, కంప్యూటర్లు, రవాణా సౌకర్యాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు మొదలైనవి.

- ఒక సంవత్సరంలో ఒక రంగంలో ఉత్పత్తి చేసిన అంతిమ వస్తువుల, సేవల విలువ ఆ సంవత్సరానికి ఆ రంగంలోని మొత్తం ఉత్పత్తిని సూచిస్తుంది.
- మనదేశంలో 92 శాతం మంది కార్మికులు అవ్యవస్థీకృత రంగంలో పనిచేస్తున్నారు. 8 శాతం మంది కార్మికులు మాత్రమే వ్యవస్థీకృత రంగంలో పనిచేస్తున్నారు.

### కీలక పదాలు – నిర్వచనాలు:

1. **స్థూల జాతీయోత్పత్తి** (Gross National Product - GNP): ఒక సంవత్సరంలో దేశంలో ఉత్పత్తి చేసిన వస్తు సేవల మొత్తం విలువను స్థూల జాతీయోత్పత్తి అంటారు. ఈ భావనలో ఉత్పత్తి ఎక్కడ అయ్యిందో ముఖ్యం కాదు. ఎవరు ఉత్పత్తి చేశారనేది ముఖ్యం.
2. **స్థూల దేశీయోత్పత్తి** (Gross Domestic Product-GDP): దేశంలో సంవత్సర కాలంలో ఉత్పత్తి చేసిన వస్తు సేవల మార్కెట్ విలువను స్థూల దేశీయోత్పత్తి అంటారు. ఈ భావన ఎవరు ఉత్పత్తి చేశారు అనేదాని కంటే ఎక్కడ ఉత్పత్తి చేశారు అనే దానికి అధిక ప్రాధాన్యతనిస్తుంది.
3. **అంత్య వస్తువులు:** ఇతర వస్తువుల తయారీకి ఉపయోగించని ఉత్పాదకాలను అంత్య వస్తువులంటారు.
4. **ఉపాధి బదిలీ:** శ్రామికులు ఒక రంగంలో ఉపాధి క్రమ పద్ధతిలో లభించనప్పుడు వేరే రంగంలో ఉపాధి కోసం తరలివెళ్లడాన్ని 'ఉపాధి బదిలీ' అంటారు.
5. **వ్యవస్థీకృత రంగం** (Organised Sector): ఉపాధికి సంబంధించిన నియమ నిబంధనలు, చట్టాలు ఉండి నమ్మకంగా పని ఉండే ప్రదేశాలు లేదా వ్యాపారాలను 'వ్యవస్థీకృత రంగం' అంటారు. ఈ రంగంలో ఒక క్రమపద్ధతిలో ఉత్పత్తి, ఉపాధి కల్పనలున్న భారీ పరిశ్రమలు, వ్యవసాయ రంగాలుంటాయి. ఈ సంస్థలు క్రమబద్ధ ప్రక్రియలు, విధానాలను పాటిస్తాయి. ఈ రంగంలోని కార్మికులకు ఉద్యోగ భద్రత ఉంటుంది.
6. **అవ్యవస్థీకృత రంగం (Un-Organised Sector):** ప్రభుత్వ నియంత్రణలో లేకుండా, ఏ విధమైన నియమ నిబంధనలు అనుసరించకుండా ఉండే చిన్న చిన్న సంస్థలను 'అవ్యవస్థీకృత రంగం' అంటారు. ఈ రంగంలో ఉద్యోగాలు, జీతాలు, ఉత్పత్తిలో నియమిత పద్ధతులేవీ ఉండవు. కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదు. చాలా తక్కువ వేతనాలుంటాయి. కుటీర, చిన్న తరహా, అల్ప పరిశ్రమల్లో పనిచేసేవారు, రోజువారీ కూలీలు, బజారులో వస్తువులు అమ్ముకునే వారు, చేతివృత్తుల వారు తదితరులు ఈ రంగంలోనివారే.
7. **అల్ప ఉపాధి:** పనిచేసేవారు తమ పూర్తి శక్తి సామర్థ్యాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోలేని ఉపాధిలో ఉండడాన్ని 'అల్ప ఉపాధి' అంటారు.

### 4 మార్కుల ప్రశ్న

1.

| రంగం | ఉపాధి (శాతంలో) | | స్థూల జాతీయోత్పత్తి (శాతంలో) | |
|---|---|---|---|---|
| | 1972–73 | 2009–10 | 1972–73 | 2009–10 |
| వ్యవసాయ రంగం | 74 | 53 | 42 | 17 |
| పారిశ్రామిక రంగం | 11 | 22 | 22 | 26 |
| సేవారంగం | 15 | 25 | 35 | 57 |

**పై పట్టిక భారతదేశంలోని వివిధ రంగాల్లో ఉపాధి, స్థూల జాతీయోత్పత్తి ఎంత శాతంలో ఉందో తెలుపుతుంది. ఈ పట్టికను అధ్యయనం చేయడం ద్వారా మీరేం అర్థం చేసుకున్నారో నోట్స్ రాయండి?**

***(ఇచ్చిన పాఠ్యాంశాన్ని చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించడం)***

- భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం (ప్రాథమిక రంగం), పరిశ్రమలు (ద్వితీయ రంగం), సేవలు (తృతీయ రంగం), అనే ప్రధాన రంగాలున్నాయి. ఈ మూడు రంగాల్లో 1972–73, 2009–10 ఆర్థిక సంవత్సరాల్లో ఉపాధి, స్థూల జాతీయోత్పత్తి ఎంత శాతంలో ఉందో పట్టిక వివరిస్తుంది.
- 1972–73 సంవత్సరంలో వ్యవసాయ రంగంలో 74 శాతం మంది ఉపాధి పొందగా వారి సంఖ్య క్రమంగా తగ్గి 2009–10 సంవత్సరంలో 53 శాతం అయ్యింది. అదే సమయంలో 1972–73లో కేవలం 11 శాతం మందికి ఉపాధి కల్పించిన పారిశ్రామిక రంగంలో ఆ సంఖ్య రెట్టింపై 22శాతంగా 2009–10లో నమోదైంది. అలాగే సేవా రంగంలోనూ ఉపాధి సౌకర్యాలు పెరిగాయి. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే వ్యవసాయ రంగంలో ఉపాధి పొందేవారి సంఖ్య ఏళ్లు గడుస్తున్న కొద్దీ తగ్గి ఆ ప్రభావం ద్వితీయ, తృతీయ రంగాలపై పడుతుంది. ఇది అభివృద్ధికి సూచికైన మన దేశంలో సగం కంటే ఎక్కువ మంది ఇంకా వ్యవసాయ రంగంపైనే ఆధారపడుతున్నారు. వృత్తి నైపుణ్యాలు లేని చాలా మంది వ్యవసాయ రంగంలోనే ఉపాధి వెతుక్కుంటున్నారు. వ్యవసాయ రంగంలో ప్రచ్ఛన్న నిరుద్యోగం నెలకొంది. పరిశ్రమలు, సేవారంగం ఎంత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తే ఆర్థిక వ్యవస్థకు అంత మంచిది. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.
- స్థూల జాతీయోత్పత్తి ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిని సూచిస్తుంది. 1972–73లో వ్యవసాయ రంగం ద్వారా 42 శాతం స్థూల జాతీయోత్పత్తి ఏర్పడగా అది 2009–10లో కేవలం 17 శాతానికి తగ్గింది. అదే సమయంలో సేవా రంగంలో స్థూల జాతీయోత్పత్తి 35 శాతం నుంచి 57 శాతానికి పెరిగింది. పారిశ్రామిక రంగంలోనూ అలాంటి పరిణామమే జరిగింది. అంటే ద్వితీయ, తృతీయ రంగాల స్థూల జాతీయోత్పత్తి వాటా గణనీయంగా పెరిగింది. ఇదీ మంచి సూచికే అయినా వ్యవసాయ రంగ ఉత్పత్తి చాలా క్షీణించడం వ్యవసాయాధారిత భారతదేశానికి మంచి పరిణామం కాదు.
- వ్యవసాయ రంగంలో ఉపాధి ఎక్కువగా ఉండి స్థూల జాతీయోత్పత్తి తక్కువగా ఉంది. అదే సేవా రంగంలో ఉపాధి చాలా తక్కువగా ఉండి కూడా స్థూల జాతీయోత్పత్తి ఎక్కువగా ఉంది. స్థూల జాతీయోత్పత్తిలోని వివిధ రంగాల వాటాల్లో వచ్చినంత మార్పు ఉపాధిలో రాలేదు. ఇప్పటికీ వ్యవసాయమే ప్రధాన ఉపాధి రంగంగా ఉంది.
- కార్మికుల్లో సగం కంటే ఎక్కువ మంది వ్యవసాయ రంగంలో ఉండి, ఆరింట ఒకవంతు (1/6) ఉత్పత్తికి మాత్రమే దోహదపడుతున్నారు. దీనికి విరుద్ధంగా స్థూల జాతీయోత్పత్తిలో 80 శాతం వాటా ఉన్న పారిశ్రామిక, సేవా రంగాలు మొత్తం కార్మికుల్లో దాదాపు సగం మందికి మాత్రమే ఉపాధి కల్పిస్తున్నాయి.

### 2 మార్కుల ప్రశ్నలు

1. **నోట్ పుస్తకం, కారు, కంప్యూటర్‌లు తుది ఉత్పాదకాలయితే వాటి మధ్య దశ ఉత్పాదకాలను తెలపండి? (సమాచార నైపుణ్యం)**

| తుది ఉత్పాదకాలు | మధ్య దశ ఉత్పాదకాలు |
|---|---|
| నోట్ పుస్తకం | వెదురు, కర్ర గుజ్జు, సాల్ట్‌కిక్, బ్లీచింగ్ పౌడర్ |
| కారు | టైర్లు, ప్లాస్టిక్, ఆటో మొబైల్స్, పెట్రోలియం |
| కంప్యూటర్ | ప్లాస్టిక్, రాగి, గాజు, ఇతర విడి పరికరాలు |

2. **సేవా రంగం ఇతర రంగాల కంటే ఎలా భిన్నమైంది? ఉదాహరణలు తెలపండి? (విషయావగాహన)**

- సేవా రంగం ఇతర రెండు రంగాల కంటే భిన్నమైంది. ఎందుకంటే దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం, పరిశ్రమలు పుష్టిని చేకూరిస్తే సేవా రంగం ఆధునికీకరణను సూచిస్తుంది.
- విద్యావంతుల్లో సగం కంటే ఎక్కువ మంది స్వయంఉపాధి పొందుతున్నారు.
- సేవా రంగానికి ఉదాహరణలు..రవాణా, సమాచార ప్రసార సాధనాలు, ఆర్థిక సంస్థలు, బ్యాంకింగ్, బీమా, పౌర పాలన మొదలైనవి.

### 1 మార్కు ప్రశ్నలు

1. **ప్రచ్ఛన్న నిరుద్యోగం అంటే ఏమిటి? (విషయావగాహన)**

- అవసరమైన దాని కంటే ఎక్కువ మంది ఒక పనిలో నిమగ్నమైనప్పుడు వారిలో కొంతమంది వ్యక్తులు పనిచేయనప్పటికీ ఉత్పాదకతలో ఎలాంటి తగ్గుదల లేనట్లయితే ఆ పని వదిలేసిన వ్యక్తులను ప్రచ్ఛన్న నిరుద్యోగులుగా పరిగణిస్తారు. వీరికి తమ సామర్థ్యానికి తగిన పని లభించదు. మనదేశ వ్యవసాయ రంగంలో ఈ విధమైన నిరుద్యోగం అధికంగా ఉంది.

2. **కింది వాటిలో వేరుగా ఉన్న దాన్ని గుర్తించి కారణాలు చెప్పండి?**
   **టీచర్, డాక్టర్, కూరగాయలు అమ్మే వ్యక్తి, న్యాయవాది *(సమాచార సేకరణ నైపుణ్యం)***

- కూరగాయలు అమ్మే వ్యక్తి అనే పదం వేరుగా ఉంది. ఎందుకంటే టీచర్, డాక్టర్, లాయర్‌లు వ్యవస్థీకృత రంగానికి చెందిన వారు. కూరగాయలు అమ్మే వ్యక్తి అవ్యవస్థీకృత రంగానికి చెందినవాడు.

### లక్ష్యాత్మక ప్రశ్నలు (½ మార్కు)

1. **ఎక్కువగా సహజ ప్రక్రియలను ఉపయోగించి ఏ రంగంలో వస్తువులను ఉత్పత్తి చేస్తారు?**
   1) ప్రాథమిక 2) ద్వితీయ
   3) తృతీయ 4) సమాచార సాంకేతిక
2. **2009–10ల మధ్య స్థూల జాతీయోత్పత్తిలో సేవా రంగం వాటా ఎంత?**
   1) 20 – 30 శాతం 2) 30 – 40 శాతం
   3) 50 – 60 శాతం 4) 70 శాతం
3. **ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన అధిక శాతం కార్మికులు ఏ రంగంలో ఉన్నారు?**
   1) పారిశ్రామిక 2) తృతీయ
   3) వ్యవస్థీకృత 4) అవ్యవస్థీకృత
4. **2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో ఎంతమంది పనిచేస్తున్నారు?**
   1) 65 కోట్లు 2) 46 కోట్లు
   3) 38 కోట్లు 4) 35 కోట్లు
5. **భవన విక్రయ కంపెనీల సేవలు ఏ రకమైనవి?**
   1) వ్యక్తిగత 2) ఆర్థిక
   3) స్థిరాస్తి 4) సామాజిక
6. **వ్యవసాయ రంగంలోని అత్యధిక మంది కార్మికులు ______ లో నివసిస్తున్నారు.**
7. **90 శాతం పట్టణ ప్రాంత పనివారు ______, ______ రంగాల్లో ఉపాధి పొందుతున్నారు.**
8. **స్త్రీ, పురుషుల నిష్పత్తిని పోలిస్తే స్త్రీలు ______, ______ రంగాల్లో కొద్ది శాతం మాత్రమే ఉపాధి పొందుతున్నారు.**
9. **భారతదేశంలో ఆర్థిక సంవత్సరం అంటే ______ నుంచి ______ వరకు.**
10. **స్థూల జాతీయోత్పత్తి అనేది ఒక ఏడాదిలో ఉత్పత్తి చేసిన ____ , ____ మొత్తం విలువ.**
11. **______ రంగంలో అధిక శాతం కార్మికులకు ఉద్యోగ భద్రత ఉంది.**
12. **ఉత్పత్తితో సమానంగా ______ రంగంలో ఉపాధి పెరగలేదు.**

### సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 2; 5) 3.
6) గ్రామీణ ప్రాంతం;
7) పారిశ్రామిక, సేవల;
8) పారిశ్రామిక, సేవా;
9) ఏప్రిల్, మార్చి;
10) అన్ని అంతిమ వస్తువులు, సేవల;
11) వ్యవస్థీకృత;
12) సేవా